వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చూడాలి

- అధికారులు సమన్వయంతో సేవలందించాలి
- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

కృష్ణకాలనీ, ఫిబ్రవరి 18 : రానున్న వేసవి కాలంలో భూపాలపల్లి జిల్లాలోని ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆదేశించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో జడ్పీ చైర్ పర్సన్ జక్కు శ్రీహర్షిణీ రాకేశ్ అధ్యక్షతన జడ్పీ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి భూపాలపల్లి ఎమ్మెల్యే సత్యనారాయణరావు, కలెక్టర్ భవేశ్‌మిశ్రా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సమావేశంలో ముందుగా ఆయా శాఖల అధికారులు తమ శాఖలో జరుగుతున్న అభివృద్ధి పనులను వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తాగునీటి సమస్య రాకుండా రెండు, మూడు రోజుల్లో మండలాల వారీగా అధికారులు ప్రత్యేక సమావేశాలు నిర్వహించి ప్రతిపాదనలు సిద్ధం చేసుకోవాలన్నారు. గ్రామాల్లో రిపేరు చేయాల్సిన బోరుపంపులకు కావాల్సిన నిధులు కేటాయిస్తామన్నారు. వచ్చే ఖరీఫ్ నాటికి చెరువులు, కుంటలు మరమ్మతు చేసి రైతులకు సాగునీటి సమస్య రాకుండా చూడాలన్నారు. రేగొండ మండలంలోని కోటంచ ఆలయ అభివృద్ధికి రూ. 8 కోట్లు, భాగిర్తిపేట కమాన్ నుంచి కోటంచ వరకు డబుల్ రోడ్డు వేయడానికి రూ. 25 కోట్ల నిధులకు ప్రతిపాదనలు పంపామని అవి మంజూరు కాగానే కోటంచ ఆలయం, పాండవుల గుట్ట, బుగులోని జాతరలో నిర్వహించే అభివృద్ధి పనులను సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేయిస్తామన్నారు. 30 రోజుల్లో నిధులు మంజూరు చేయించి జిల్లా కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్లు, ప్రభుత్వ కార్యాలయాలు నిర్మిస్తామన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల శాతం పెంచాలని, పాఠశాలలకు అవసరమైన అభివృద్ధి పనులను నివేదిక ద్వారా తెలియజేయాలన్నారు. జిల్లాకు మంజూరైన రోడ్లను ఎన్నికల కోడ్ ముందే

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

ప్రారంభించాలని, వచ్చే పది రోజుల్లో వాటిని పూర్తి చేయిస్తామన్నారు. పీఆర్ శాఖ ద్వారా వేసే రోడ్లలో నాణ్యత పాటించేలా చూడాలన్నారు. జడ్పీ, పీఆర్ డివిజనల్ కార్యాలయాల నిర్మాణాల కోసం అవసరమైన నివేదిక అందిస్తే వెంటనే నిధులు మంజూరు చేయిస్తామన్నారు. రింగు రోడ్డు, నేషనల్ హైవే రోడ్డు నిర్మాణానికి రూ. 200 కోట్లకు ప్రతిపాదనలు పంపామన్నారు. భూపాలపల్లి మెడికల్ కాలేజీకి కావాల్సిన నిధులు సింగరేణి అధికారులతో మాట్లాడి సమకూరుస్తామన్నారు. అనంతరం కలెక్టర్ భవేశ్‌మిశ్రా మాట్లాడుతూ రెండు రోజుల్లో కోటంచ రెవెన్యూ పరిధిలోని భూములకు పట్టాలిస్తున్నామని, మిగతా మండలాల రైతులకు వీలైనంత త్వరలోనే ఇస్తామన్నారు. జిల్లాకు 203 స్టాఫ్ నర్సులను సీఎం నియమించగా 183 మంది జాయిన్ అయ్యారని, త్వరలోనే అన్ని శాఖల్లోని ఖాళీలను భర్తీ చేస్తామన్నారు.

అధికారులపై ఎమ్మెల్యే గండ్ర ఫైర్

సమావేశానికి హాజరు కాని అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి జడ్పీ, మండల సర్వసభ్య సమావేశాలకు అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పలు అంశాలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు అధికారులు సరిగా స్పందించకపోవడంపై సభ్యులు, ఎమ్మెల్యే కూడా అసహనం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్ పర్సన్ శోభ, అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, జడ్పీ సీఈఓ విజయలక్ష్మి, జడ్పీటీసీలు, ఎంపీపీలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన డీఎస్పీ సంపత్‌రావు

ఇటీవల భూపాలపల్లి డీఎస్పీగా సంపత్‌రావు బాధ్యతలు స్వీకరించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావును డీఎస్పీ కలిసి పుష్పగుచ్ఛం అంజేశారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

కృష్ణకాలనీ : భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఆయా వార్డుల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో సంబంధిత కాంట్రాక్టర్లు నాణ్యత పాటించాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సూచించారు. గురువారం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పుల్లూరి రామయ్యపల్లి, మంజూర్‌నగర్, వేశాలపల్లి, రాంనగర్ కాలనీ, రెడ్డికాలనీల్లో రూ. 3 కోట్ల నిధులతో సీసీ రోడ్డు పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కమలా లక్ష్మారెడ్డి, దాట్ల శ్రీనివాస్, కురిమిల్ల రజిత శ్రీనివాస్, ముంజాల రవీందర్ గౌడ్, శిరుప అనిల్, భారత జాగృతి జిల్లా అధ్యక్షుడు మాడ హరీశ్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ టీ రాజేశ్వర్, కాంగ్రెస్ నాయకులు చల్లూరి సమ్మయ్య, కే సాంబమూర్తి, మల్లేశ్ గౌడ్, బుర్ర కొమురయ్య, అప్పం కిషన్ తదితరులు పాల్గొన్నారు.

మేడారంలో పూజారులకు దుస్తులు అందిస్తున్న మంత్రి సీతక్క

భక్తులు స్వీయ నియంత్రణ పాటించాలి : సీతక్క

తాడ్వాయి, ఫిబ్రవరి 18 : మేడారం వచ్చే భక్తులు స్వీయ నియంత్రణ పాటించాలని మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. ఆదివారం సాయంత్రం మేడారంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని చర్యలు చేపట్టామన్నారు. 6 వేల ఆర్టీసీ బస్సులతో భక్తులను చేరవేయనున్నట్లు తెలిపారు. మహా జాతరకు అందరికీ ఆహ్వానం పలుకుతున్నామని మంత్రి వెల్లడించారు. ఎస్పీ మాట్లాడుతూ జాతర విజయవంతానికి అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం పూజారులకు ప్రత్యేక వస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీవో అంకిత్, అదనపు కలెక్టర్ శ్రీజ, ఈవో రాజేందర్, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీఐ, ఎన్‌హెచ్‌ఆర్సీ కమిషనర్లను నియమించాలి

కృష్ణకాలనీ, ఫిబ్రవరి 18 : మానవ హక్కుల ఉల్లంఘన జరుగకుండా చూడాల్సిన జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్సీ)లకు కమిషనర్లను నియమించాలని ఎన్‌హెచ్‌ఆర్సీ రాష్ట్ర ఈసీ సభ్యుడు తోట రాజయ్య, జిల్లా అధ్యక్షుడు కుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఎన్‌హెచ్‌ఆర్సీ జిల్లా ప్రధాన కార్యదర్శి అమృత అశోక్ కురుమ అధ్యక్షతన ఏర్పాటు చేసినా విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. చాలా కాలం నుంచి కమిషనర్లు లేక అనేక సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ఈ రెండు శాఖలకు సమర్థులైనా రిటైర్డ్ జడ్జీలను కమిషనర్లను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎన్‌హెచ్‌ఆర్సీ నాయకులు శ్యామ్ యాదవ్, బైకని రమేశ్, రాధాకృష్ణ, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి లక్నవరం సందర్శన బంద్

గోవిందరావుపేట, ఫిబ్రవరి 18 : పర్యాటక ప్రాంతమైన లక్నవరం సందర్శనను సోమవారం నుంచి నిలిపివేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మేడారం సమ్మక్క, సారలమ్మ మహా జాతర సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తారని పేర్కొన్నారు. ఈ క్రమంలో ట్రాఫిక్ సమస్య తలెత్తే అవకాశం ఉన్నందున ఈ నెల 26 వరకు లక్నవరం సందర్శనను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీ కొని ఒకరికి గాయాలు

ఏటూరునాగారం, ఫిబ్రవరి 18 : మండల కేంద్రంలోని వై జంక్షన్ సమీపంలో ఆదివారం సాయంత్రం ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టగా ఒకరికి గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. మణుగూరు నుంచి ఏటూరునాగారం వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు ఏటూరునాగారం నుంచి వాజేడు వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న పూనెం సతీశ్‌ను ఢీకొట్టగా స్వల్ప గాయాలయ్యాయి.

టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా సమ్మయ్య

ఏటూరునాగారం, ఫిబ్రవరి 18 : టీఎస్‌యూటీఎఫ్ కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా పొడెం సమ్మయ్య, కోశాధికారిగా వెంకటస్వామి నియమితులయ్యారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సోమశేఖర్, మల్లారెడ్డి, వరంగల్ జిల్లా కార్యదర్శి సృజన్‌కుమార్ పాల్గొనిమాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలని కోరారు. నాయకులు గొప్ప సమ్మారావు, ఆర్ వాసుదేవరెడ్డి, వెంకటస్వామి, కొండ చెంచయ్య, పాపారావు, స్వరూప పాల్గొన్నారు.

బీసీల కులగణన హర్షణీయం

తాడ్వాయి, ఫిబ్రవరి18 : రాష్ట్రంలో బీసీల కులగణన చేపట్టడం హర్షణీయమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవి అన్నారు. ఆదివారం మేడారం సమ్మక్క, సారలమ్మను ఆయన కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సమగ్ర కులగణన చేయడం ద్వారా బీసీలకు న్యాయం జరుగుతుందని అన్నారు.

పశువులను రోడ్లపైకి రానివ్వొద్దు

గోవిందరావుపేట, ఫిబ్రవరి 18 : జాతర సందర్భంగా పశువులను రోడ్లపైకి రానివ్వొద్దని ఎస్సై షేక్ మస్తాన్ తెలిపారు. భక్తుల వాహనాలతో రహదారి రద్దీగా ఉంటుందని, పశువులు రోడ్లపైకి వస్తే ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందన్నారు. పశువులను రోడ్లపైకి తీసుకువచ్చే వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

రోప్ పార్టీకి శిక్షణ

తాడ్వాయి, ఫిబ్రవరి18 : వనదేవతల రాక సందర్భంగా ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఏర్పాటు చేసిన రోప్ పార్టీకి ఆదివారం శిక్షణ నిర్వహించారు. చిలకలగుట్ట నుంచి సమ్మక్క, కన్నెపల్లి నుంచి సారలమ్మను తీసుకువచ్చే క్రమంలో భక్తులు పూజారులను తాకేందుకు ఎగబడుతుంటారు. ఈ సమస్యను అధిగమించేందుకు రోప్ పార్టీ తీసుకోవాల్సిన జాగ్రత్తలను అదనపు ఎస్పీ సదానందం వివరించారు.

రామప్పలో సండే సందడి

వెంకటాపూర్, ఫిబ్రవరి 18 : మండలంలోని రామప్ప దేవాలయం ఆదివారం సందడిగా మారింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు వివిధ రాష్ట్రాల నుంచి 20 వేల మంది పర్యాటకులు, విద్యార్థులు, మేడారం భక్తులు, నెదర్లాండ్ దేశస్తులు అన్యా, విల్టన్ సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పూజారులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్ తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ చరిత్ర, విశిష్టతను గైడ్స్ వివరించారు. అనంతరం రామప్ప సరస్సుకు చేరుకొని బోటింగ్ చేశారు. కాగా, బుధవారం నుంచి ప్రారంభమయ్యే మేడారం జాతర సందర్భంగా తిరుగు ప్రయాణంలో రామప్పను సందర్శించే భక్తుల సౌకర్యార్థం దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో క్యూలైన్లు, పార్కింగ్ స్థలంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో లైటింగ్ ఏర్పాటు చేస్తున్నారు.

అటవీ శాఖ ఉద్యోగులకు న్యాయం చేయాలి

మంగపేట, ఫిబ్రవరి 18 : అటవీ పరిరక్షణ కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ఉద్యోగుల శ్రమను గుర్తించి రాబోయే పీఆర్‌సీలో ఇతర యూనిఫామ్ శాఖలతో సమాన వేతనం కల్పించాలని ములుగు డివిజన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కోటేశ్వర్ కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన స్థానిక అటవీ ఉద్యోగులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ప్రాణాలను సైతం లెక్కచేయకుండా 24 గంటలు విధుల్లో ఉంటున్న అటవీ శాఖ ఉద్యోగులు సరైన వేతనం లేక ఇబ్బంది పడుతున్నారని వాపోయారు. విధి నిర్వహణలో భాగంగా కలప స్మగ్లర్లు, వేటగాళ్లు తదితర అసాంఘిక శక్తులతో నిత్యం ఘర్షణ ఎదుర్కొంటున్న ఉద్యోగులకు పీఆర్‌సీలో తగిన న్యాయం చేయాలని కోటేశ్వర్ కోరారు.

డిపో మేనేజర్‌పై ప్రయాణికుల ఆగ్రహం

ఆర్టీసీ డీఎం లక్ష్మీనారాయణతో గొడవ పడుతున్న ప్రయాణికులు

కృష్ణకాలనీ, ఫిబ్రవరి 18 : భూపాలపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ గురిజాల లక్ష్మీనారాయణపై ఆదివారం సాయంత్రం ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు తెలిపిన ప్రకారం పెద్దపల్లి జిల్లాలోని గోదావరి ఖనికి చెందిన భక్తులు మేడారం వెళ్లి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో సాయంత్రం నుంచి రాత్రి 8 గంటల వరకు గోదావరిఖని వెళ్లే బస్సు రాలేదు. ఈ విషయమై పలుమార్లు ట్రాఫిక్ గైడ్‌ను వారు అడుగగా మరి కొద్దిసేపట్లో వస్తుందని చెప్పుకుంటూ వచ్చారు. బస్టాండ్‌లోనే ఉన్న డీఎం లక్ష్మీనారాయణ ఇదే విషయం చెప్పాడు. మూడు గంటలైనా బస్సు రాకపోవడంతో తమకు తప్పుడు సమాచారం ఎందుకిస్తున్నారని డీఎంను నిలదీయడంతో ఆయన ప్రయాణికులతో దురుసుగా ప్రవర్తించాడు. దీంతో ఆగ్రహానికి గురైన ప్రయాణికులు ఒక్కసారిగా డీఎంతో గొడవకు దిగారు. ఒక దశలో డీఎం, ట్రాఫిక్ గైడ్‌పై దాడి చేసేందుకు యత్నించారు. అక్కడున్న కొంతమంది ప్రయాణికులను శాంతింపజేయగా గొడవ సద్దుమణిగింది. అనంతరం డీఎం ప్రత్యేకంగా బస్సును ఏర్పాటు చేసి ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు తరలించారు.

హరిత హోటల్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

మంత్రుల పర్యటన ఏర్పాట్ల పరిశీలన

తాడ్వాయి, ఫిబ్రవరి 18 : మేడారంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, ధనసరి సీతక్క సోమవారం పర్యటించనున్నారు. ఈ మేరకు గద్దెల ప్రాంగణంతో పాటు చిలకలగుట్ట, హరిత హోటల్, ఆర్టీసీ బస్టాండ్ తదితర ప్రాంతాల్లో చేపట్టిన ఏర్పాట్లను ఆదివారం కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ శ్రీజ పరిశీలించారు.

ఇసుక తరలిస్తున్న టిప్పర్, ట్రాక్టర్ల పట్టివేత

టేకుమట్ల, ఫిబ్రవరి 18 : మండలంలోని కలికోట మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్, రెండు ట్రాక్టర్లను పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. రేగొండ మండలం దమ్మన్నపేటకు చెందిన టిప్పర్ ఓనర్ నడిపెల్లి శ్రీనివాస్‌రావు, మొగుళ్లపల్లి మండలం మేదరమెట్లకు చెందిన డ్రైవర్ కట్ల ప్రణయ్, భూపాలపల్లి మండలం నేరేడుపల్లికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్, ఓనర్ పుట్టపాక దేవేందర్, రజినీకాంత్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వాగులో నిలిచిన కలుషిత నీటిలో స్నానం చేస్తున్న చిన్నారులు

మురికి నీటిలోనే భక్తుల స్నానాలు

జంపన్నవాగుకు చేరుకోని లక్నవరం నీరు

తాడ్వాయి, ఫిబ్రవరి 18 : అమ్మవార్ల దర్శనానికి మేడారం వచ్చే భక్తులు నీళ్లు లేక అవస్థలు పడుతున్నారు. జంపన్నవాగులోకి ఇంకా లక్నవరం నీరు చేరుకోక పోవడంతో జంట వంతెనల వద్ద కలుషితమైన నీటిలోనే స్నానాలు చేస్తున్నారు. ట్యాప్‌ల ద్వారా వస్తున్న నీరు వాగులో ఏర్పాటు చేసిన ఇసుక బస్తాల అడ్డుకట్టల వద్ద నిలిచిపోగా అందులోనే స్నానాలు చేస్తూ అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకుంటున్నారు. జాతరకు రెండు రోజులే ఉండగా వాగులో పుణ్యస్నానాలు చేసే వీలు లేకపోవడంతో భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

కాళేశ్వరం, ఫిబ్రవరి 18 : ఇటీవల లారీ ప్రమాదంలో మృతి చెందిన మహదేవపూర్ మండలం మెట్టుపల్లికి చెందిన పిట్టల సారయ్య కుంటుంబానికి ఆదివారం స్థానిక యాదవ సంఘం నాయకులు 25 కిలోల బియ్యం, నిత్యావసర వస్తువులు, నగదును అందజేశారు. కార్యక్రమంలో సంఘం గ్రామ అధ్యక్షుడు మలిగి మధూకర్, నాయకులు మల్లేశ్, శంకర్, పర్వతాలు, రాజయ్య, యాదయ్య, తిరుపతి, పెద్ద రాజయ్య, చిన్న రాజయ్య, సమ్మయ్య పాల్గొన్నారు.

పల్లెల్లో పడకేసిన పారిశుధ్యం

- పట్టించుకోని ప్రత్యేకాధికారులు • ప్రశ్నార్థకంగా ప్రజారోగ్యం

గణపురంలో నిండిపోయిన డ్రైనేజీ

గణపురం, ఫిబ్రవరి 18 : పల్లెల్లో పారిశుధ్యం పడకేసింది. దీంతో ప్రజారోగ్యం ప్రశ్నార్థకంగా మారింది. దుర్గంధంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజా ప్రతినిధుల పర్యటనల ప్పుడు గుప్పెడు బ్లీచింగ్ చల్లి చేతులు దులుపుకుంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా వేల కోట్ల రూపాయలు కుమ్మరిస్తున్న పల్లెల రాత మారడం లేదు. ప్రత్యేక అధికారులు గ్రామాల్లో పారిశుధ్య పనులను పట్టించుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్న తాధికారులు సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

అంగట్లో అంగన్‌వాడీ కోడిగుడ్లు

చిట్యాల, ఫిబ్రవరి 18 : చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందాల్సిన అంగనవాడీ కోడి గుడ్లు మండల కేంద్రంలోని కిరాణ షాపుల్లో అమ్మకానికి పెడుతున్నట్లు ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ వేల్పుల రాజ్ కుమార్ ఆరోపించారు. ఆదివారం అయన విలేకరులతో మాట్లాడారు. అంగన్‌వాడీ గుడ్లను గుర్తు పట్టేలా ప్రభుత్వం వాటిపై ముద్ర వేసి సెంటర్లకు సరఫరా చేస్తున్న విషయం తెలిసిందే. వాటిని గుర్తు పట్టకుండా షాపుల యజమానులు రంగులను సబ్బునీటితో శుభ్రం చేసి విక్రయిస్తున్నారన్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లనే పిల్లలు, గర్భిణులకు అందాల్సిన గుడ్లు, పౌష్టికాహారం పక్కదారి పడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే కలెక్టర్ స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాకేశ్, సాయి, శివ తదితరులు పాల్గొన్నారు.

మహాముత్తారం ఎస్సైగా మహేందర్

కాటారం(మహాముత్తారం), ఫిబ్రవరి 18 : మహాముత్తారం ఎస్సైగా మహేందర్ కుమార్ యాదవ్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. భూపాలపల్లి జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న మహేందర్ అధికారుల బదిలీ ఉత్తర్వుల మేరకు మహాముత్తారానికి వచ్చారు. గతంలో చిట్యాల, మొగుళ్లపల్లి, పస్రా పోలీస్ స్టేషన్‌లో పని చేశారు.

తాటివనాల రక్షణకు బ్యారిక్స్ ట్రాప్స్ ఏర్పాటు

బ్యారిక్స్ ట్రాప్స్‌ను చూపిస్తున్న గీత కార్మికులు

గణపురం, ఫిబ్రవరి 18 : మొగి పురుగు నుంచి తాటి వనాలను రక్షించుకోవడానికి బ్యారిక్స్ ట్రాప్స్ ఏర్పాటునకు బస్వరాజుపల్లి, పరశురాంపల్లి గీత కార్మికులు శ్రీకారం చుట్టారు. గీత కార్మికులు సొసైటీ ఆధ్వర్యంలో బ్యారిక్స్ ట్రాప్స్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఒక్క ఎకరం విస్తీర్ణంలో ఒక ట్రాప్స్ సరిపోతుందని గీత కార్మికులు తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా గౌడ కులస్తులు తాటి వనాల రక్షణకు బ్యారిక్స్ ట్రాప్స్‌లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

సీఐ రాజేశ్ మృతికి సంతాపం

కాటారం, ఫిబ్రవరి18 : సీఐ రాజేశ్ మృతికి యువత, క్రీడాకారులు సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2010లో కాటారంలో ఎస్సైగా పని చేసి ఈ ప్రాంత ప్రజల మన్ననలు పొందారన్నారు. కరీంనగర్ కమిషనరేట్‌లో సీసీఆర్‌బీ సీఐగా పని చేస్తున్న సాయిరి రాజేశ్ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందడం బాధాకరమన్నారు. మండల కేంద్రంలోని క్రికెట్ గ్రౌండ్‌లో సీఐ నాగార్జునరావుతో కలిసి యువత రాజేశ్ ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. రాజేశ్ క్రీడాకారులను ప్రోత్సహించే వారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు, కాంగ్రెస్ నేతలు విలాస్‌రావు, చీమల రాజు, సందీప్, అశోక్, నరేశ్, ప్రభాకర్, ప్రభుదాస్, మహేశ్, ముఫిద్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీపాద స్మారక క్రికెట్ పోటీలు

కాటారం, ఫిబ్రవరి 18 : మండల కేంద్రంలో నిర్వహించిన శ్రీపాద స్మారక డివిజన్ స్థాయి జీపీఎల్ క్రికెట్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ దుద్దిళ్ల శ్రీనుబాబు విజేతలకు ట్రోఫీ, నగదు బహుమతులు అందజేశారు. ఈ టోర్నీలో రాక్‌స్టార్ జట్టు ప్రథమ, హిందుస్థాన్ 333 ద్వితీయ, ఆర్‌కే-11 స్టైకర్స్ తృతీయ బహుమతులు గెలుచుకున్నాయి. కార్యక్రమంలో సీఐ నాగార్జునరావు, ఎంపీపీ పంతకాని సమ్మయ్య, ఎంపీటీసీలు రవీందర్‌రావు, అబ్దుల్ అజీజ్, విలాస్‌రావు, చీమల సందీప్, నవీన్‌రావు, అంగజాల అశోక్, తెప్పల ప్రభాకర్, బోడ నరేశ్, వెంకట్‌రెడ్డి, సుశీల్‌రావు, లచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మేడారానికి ప్రత్యేక బస్సులు ప్రారంభం

బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న ఎస్సై కృష్ణ ప్రసాద్, అసిస్టెంట్ మేనేజర్ విజయశ్రీ

ఏటూరునాగారం, ఫిబ్రవరి 18 : ఏటూరునాగారం నుంచి మేడారం జాతరకు ప్రత్యేక బస్సులను ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ ఆదివానం ప్రారంభించారు. సత్తుపల్లి డిపో ప్రతిరోజూ ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు అసిస్టెంట్ మేనేజర్ పీ విజయశ్రీ తెలిపారు. కార్యక్రమంలో డిపో అధికారులు వీడీ రెడ్డి, జే వెంకటయ్య, ఎన్ఆర్ కృష్ణ, కిన్నెర ఆనంద్, కాంతారావు, కంట్రోలర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మహా జాతరకు రెండు రోజులే..

- అయినా పూర్తికాని అభివృద్ధి పనులు
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు

కొనసాగుతున్న మీటింగ్ హాల్ నిర్మాణ పనులు

తాడ్వాయి, ఫిబ్రవరి18 : మేడారం సమ్మక్క,సారలమ్మల మహాజాతరకు మరో రెండు రోజులే ఉంది. అయినప్పటికీ ఇంకా అభివృద్ధి పనులు పూర్తికాలేదు. జాతర పరిసరాల్లో చేపట్టిన ప్రతి పనిని పూర్తిచేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని మంత్రులు, ఉన్నతాధికారులు చెప్తున్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మంత్రుల సమీక్షా సమావేశాల్లో వివిధ శాఖల అధికారులు పనులు పూర్తయ్యాయని నివేదికలిస్తున్నా క్షేత్రస్థాయిలో మాత్రం ఇంకా జరుగుతూనే ఉన్నాయి. ఐటీడీఏ, ట్రైబల్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో రూ. 25 లక్షలతో ఆదివాసీ మ్యూజియం ఆవరణలో నిర్మిస్తున్న మీటింగ్ హాల్ పనులు ఇంకా పూర్తికాలేదు. ఓ వైపు ప్లాస్టరింగ్ పనులు కొనసాగిస్తూనే మరో వైపు హడావుడిగా రంగులు వేస్తున్నారు. ఇదే శాఖ ఆధ్వర్యంలో జంపన్నవాగు దారిలో రూ. 75 లక్షలతో చేపట్టిన కిచెన్ షెడ్డు పనులు ప్లాస్టరింగ్ దశలోనే ఉన్నాయి. జాతర సమీపించడంతో నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా పనులు చేస్తున్నారు.

అమ్మవార్ల సేవకు ఆర్టీసీ సన్నద్ధం

- నేటి నుంచి మేడారానికి ప్రత్యేక బస్సులు
- భూపాలపల్లి పరిధిలో నాలుగు తాత్కాలిక బస్టాండ్లు
- 160 బస్సులు.. విధుల్లో 470 మంది సిబ్బంది

కృష్ణకాలనీ, ఫిబ్రవరి 18 : వన దేవతలు మేడారం సమ్మక్క-సారలమ్మల దర్శనానికి గ్రామీణ, పట్టణ ప్రాంత భక్తులను తరలించేందుకు ఆర్టీసీ ఏర్పాట్లు చేస్తున్నది. సోమవారం నుంచి 160 ప్రత్యేక బస్సులు నడిపేందుకు అధికారులు సిద్ధమయ్యారు. భూపాలపల్లి, కాటారం, కాళేశ్వరం, మహారాష్ట్రలోని సిరొంచలో నాలుగు తాత్కాలిక బస్టాండ్లను ఏర్పాటు చేసి చలువ పందిళ్లు, తాగునీరు, మరుగుదొడ్లు తదితర వసతులు కల్పించారు. భూపాలపల్లి డిపోకు చెందిన 40, ఇతర డిపోలకు చెందిన 120 బస్సులు నడుపనుండగా, 470 మంది సిబ్బంది 24 గంటల పాటు విధులు నిర్వర్తించనున్నారు. ఇందులో భాగంగా భూపాలపల్లి నుంచి 100, కాటారం నుంచి 10, కాళేశ్వర